జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం | 27 | జులై | 2026 ◆ పేజీలు : 4

## ఆరు డంప్ లు స్వాధీనం

**ఐఈడీలు, పేలుడు పదారాలు సహా 30 రకాల సామగ్రి స్వాధీనం**




**చర్ల , జూలై 26:(ప్రజా జ్యోతి ):** ఛత్తీస్గఢ్ రాష్ట్రంలోని బస్తర్ డివిజన్ లోని బీజాపూర్ జిల్లాలో సీఆర్పీఎఫ్, కోబ్రా బలగాలు చేపట్టిన నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ లో భారీ విజయాన్ని సాధించాయి. హిరామ్ గుండ అటవీ ప్రాంతంలో నక్సలైట్లు దాచిపెట్టిన ఆరు డంప్ లను గుర్తించి వాటిలో భారీ మొత్తంలో పేలుడు సామగ్రిని స్వాధీనం చేసుకున్నాయి.సీఆర్పీఎఫ్ బీజాపూర్ రేంజ్ డీఐజీ బీఎస్ నేగి మార్గదర్శకత్వంలో 199వ బెటాలియన్ కమాండెంట్ ఆనంద్ కుమార్, 85వ బెటాలియన్ కమాండెంట్ సునీల్ కుమార్ రాహి, 202వ కోబ్రా బెటాలియన్ కమాండెంట్ అలోక్ అవస్థి ఆధ్వర్యంలో ఈ ఆపరేషన్ నిర్వహించారు. 199వ, 85వ సీఆర్పీఎఫ్ బెటాలియన్ల

మిగతా 2 లో...



2 లో..

## మంగళిగుట్టలో ఇసుక తవ్వకాలు

# అక్రమమా... సక్రమమా..?

- ♦ వాగు నుంచి భారీ యంత్రాలతో ఇసుకను ఒడ్డుకు చేర్చి రాశులు పోస్తున్నారంటూ ఆరోపణలు
- ♦ అధికారుల పర్యవేక్షణ లేకుండానే డంపింగ్ చేస్తారా....?
- ♦ అనుమతులపై స్పష్టత ఇవ్వలేని అధికారులు



## దేశ నిర్మాణంలో యువత భాగస్వామ్యం అత్యంత కీలకం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ



**కొత్తగూడెం కలెక్టరేట్, జులై 26,(ప్రజాజ్యోతి)** యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మై భారత్ నిర్వహించిన వికసిత్ వైబ్రంట్ విలేజ్ కార్యక్రమం–2026లో పాల్గొన్న యువతతో నేడు వర్చువల్ విధానంలో సంభాషించారు.దేశవ్యాప్తంగా 245 జిల్లాలకు చెందిన 5,000 మందికి పైగా మై భారత్ వాలంటీర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. యువత దేశంలోని వివిధ ప్రాంతాలను సందర్శించి తమ అనుభవాలను నమోదు చేసి, సామాజిక మాధ్యమాల ద్వారా ఇతరులతో పంచుకోవాలని, తద్వారా జాతీయ సమైక్యతను మరింత బలోపేతం చేయాలని ప్రధానమంత్రి సూచించారు.హైదరాబాద్ మై భారత్ కేంద్రానికి చెందిన భవ్య, ఉత్తరకాశి లోని హర్షిల్ లోయను సందర్శించిన తన అనుభవాలను పంచుకుంటూ, అభివృద్ధి, మెరుగైన మౌలిక సదుపాయాల వల్ల సరిహద్దు గ్రామాల్లో చోటుచేసుకున్న మార్పులను వివరించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి

మిగతా 2 లో...

## తాపీ మేస్త్రి అదృశ్యం

**భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన దమ్మపేట పోలీసులు**

**దమ్మపేట, జూలై 26 (ప్రజాజ్యోతి) :** దమ్మపేట గ్రామంలోని అర్బన్ కాలనీకి చెందిన జొన్నకూటి వెంకటేశ్వరరావు వృత్తిరీత్యా తాపీ మేస్త్రి, ఈ నెల 25వ తేదీ నుంచి కనిపించకుండా పోయినట్లు ఆయన భార్య దమ్మపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది.ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం, వెంకటేశ్వరరావు శనివారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల వద్ద గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆందోళన చెందిన భార్య దమ్మపేట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా, పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.వెంకటేశ్వరరావు ఆచూకీ తెలిసిన వారు సమీపంలోని దమ్మపేట పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు. అలాగే వివిధ కోణాల్లో విచారణ చేపట్టి, ఆయన కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.



## భార్య, ఇద్దరు పిల్లలు అదృశ్యం

- టేకులపల్లి మండలంలో కలకలం.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



**టేకులపల్లి, జూలై 26,ప్రజా జ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం తొమ్మిదో మైల్ తండాలో భార్య, ఇద్దరు చిన్నారులు అదృశ్యమైన ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పది రోజులుగా వారి ఆచూకీ లభించకపోవడంతో బాధిత కుటుంబం ఆందోళన వ్యక్తం చేస్తోంది.తండాకు చెందిన భూక్య మంగీలాల్ (36) భార్య భూక్య విజయ (30), పిల్లలు అనుశ్రీ (9), మోక్షిత్ (6) ఈ నెల 16న భర్త ఇంట్లో లేని సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయారు. ఎంత వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో మంగీలాల్ ఈ నెల 20న టేకులపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినప్పటికీ ఇప్పటివరకు వారి జాడ లభించలేదు. దీంతో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడిన మంగీలాల్, తన భార్యా పిల్లలను సురక్షితంగా గుర్తించి తనకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు.ఈ ఘటనపై స్థానికంగా పలు రకాల ప్రచారాలు జరుగుతున్న నేపథ్యంలో, వాస్తవాలను వెలికితీసేందుకు అన్ని కోణాల్లో సమగ్ర విచారణ చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.ఈ విషయమై టేకులపల్లి ఎస్ ఐ తిరుపతిని వివరణ కోరగా, తొమ్మిదో మైల్ తండాకు చెందిన మహిళ, ఇద్దరు పిల్లలు కనిపించకుండా పోయిన ఘటనపై భర్త మంగీలాల్ ఫిర్యాదు చేశారని, కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నామని తెలిపారు.

## తండ్రి మందలించడంతో యువకుడి ఆత్మహత్య

- కేసు నమోదు చేసిన దమ్మపేట పోలీసులు

**దమ్మపేట,జూలై. 26(ప్రజాజ్యోతి) :**దమ్మపేట మండలంలోని రాచూరుపల్లి గ్రామ పంచాయతీ పరిధి దిబ్బగూడెంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చిలక నాగరాజు కుమారుడు వెంకన్నబాబు (19) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం, వెంకన్నబాబు ఎలాంటి పని చేయకుండా ఇంటి వద్దనే ఉంటుండటంతో తండ్రి నాగరాజు మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన వెంకన్నబాబు క్షణికావేశంలో ఈ నెల 25వ తేదీన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.ఈ ఘటనపై తండ్రి చిలక నాగరాజు దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, ఘటనకు సంబంధించిన అన్ని కోణాల్లో విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## ఆరు డంప్ లు స్వాధీనం

(మొదటి పేజీ తరువాయి...)

202వ కోబ్రా బెటాలియన్ సంయుక్త బృందాలు పిడియా, ముత్వండి ప్రాంతాల పరిధిలోని హిరామ్ గుండ అటవీ ప్రాంతంలో విస్తృత గాలింపు చర్యలు చేపట్టి, నక్సలైట్లు దాచిపెట్టిన ఆరు డంప్ లను స్వాధీనం చేసు కున్నాయి. స్వాధీనం చేసుకున్న సామగ్రిలో ఐఈడీలు, పేలుడు పదార్థాల తయారీకి ఉపయోగించే పరికరాలు, కార్డెక్స్ వైర్, డిటోనేటర్లు, గన్ పౌడర్, రేడియో సెట్లు, విద్యుత్ పరికరాలు, నక్సలైట్ల దుస్తులు తదితర మొత్తం 30 రకాల వస్తువులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. గతంలో నక్సలైట్లకు ప్రధాన కేంద్రంగా ఉన్న హిరామ్ గుండ–పిడియా ప్రాంతంలో సీఆర్పీఎఫ్ 199వ బెటాలియన్ నిరంతర నక్సల్ వ్యతిరేక చర్యల ఫలితంగా నక్సలైట్ల ప్రభావం గణనీయంగా తగ్గిందని అధికారులు అన్నారు . ఈ ఆపరేషన్ లో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని వెల్లడించారు.ఈ ప్రాంతంలో శాంతి భద్రతలు, ప్రజల రక్షణ, అభివృద్ధి కోసం నిఘా ఆధారిత ఆపరేషన్లను మరింత ఉధృతం చేసి, ప్రాంతాన్ని పూర్తిగా నక్సల్ రహితంగా మార్చేందుకు కట్టుబడి ఉన్నామని సీఆర్పీఎఫ్ అధికారులు తెలిపారు.

## దేశ నిర్మాణంలో యువత భాగస్వామ్యం అత్యంత కీలకం





(మొదటి పేజీ తరువాయి...)

ఒకప్పుడు దేశంలోని చివరి గ్రామాలుగా భావించిన సరిహద్దు గ్రామాలు నేడు దేశంలోని తొలి గ్రామాలుగా గుర్తింపు పొందుతున్నాయని పేర్కొన్నారు. వికసిత్ భారత్–2047 లక్ష్య సాధనకు దోహదపడే ఇటువంటి అనుభవాధారిత కార్యక్రమాల్లో యువత మరింత చురుకుగా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన యువత, జిల్లా యువజన, క్రీడల అధికారి పరంధామ రెడ్డి, మేరా యువ భారత్ నోడల్ అధికారి కమరతపు భాను చందర్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ నుంచి ప్రధానమంత్రి నిర్వహించిన ఈ వర్చువల్ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# మంగళిగుట్టలో ఇసుక తవ్వకాలు

# అక్రమమా... సక్రమమా..?

- వాగు నుంచి భారీ యంత్రాలతో ఇసుకను ఒడ్డుకు చేర్చి రాశులు పోస్తున్నారంటూ ఆరోపణలు
- అధికారుల పర్యవేక్షణ లేకుండానే డంపింగ్ చేస్తారా....?
- అనుమతులపై స్పష్టత ఇవ్వలేని అధికారులు





**ములకలపల్లి, జులై 26 (ప్రజాజ్యోతి):** మండలంలోని మంగలిగుట్ట ప్రాంతంలో జరుగుతున్న ఇసుక డంపింగ్ పనులపై స్థానికంగా అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మైదాన ప్రాంతానికి చెందిన కొందరు వ్యక్తులు టీఎస్ఎండీసీ నుంచి అనుమతులు వచ్చాయని చెబుతూ గత వారం రోజులుగా పాములేరు వాగు పరివాహక ప్రాంతంలో భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాగు నుంచి ఇసుకను లారీల ద్వారా ఒడ్డుకు తరలించి భారీ రాశులుగా పోస్తుండటంతో స్థానికులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం సంబంధిత శాఖల అధికారులు స్థలాన్ని పరిశీలించి సరిహద్దులను నిర్ధారించిన అనంతరం, అధికారుల పర్యవేక్షణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి మాత్రమే ఇసుక డంపింగ్ పనులు ప్రారంభించాల్సి ఉంటుంది. అయితే అలాంటి ప్రక్రియ పూర్తికాకముందే నిర్వాహకులు హడావుడిగా పనులు ప్రారంభించడం పలు అనుమానాలకు తావిస్తోంది. స్థానికుల కథనం ప్రకారం, ముందుగా వాగు నుంచి భారీ యంత్రాలతో నాణ్యమైన ఇసుకను తీసుకొచ్చి, అనుమతులు పొందినట్లు చెబుతున్న పట్టా భూముల్లో రాశులుగా పోసి, అక్కడే ఇసుక మెట్లు ఉన్నట్లు చూపించే ప్రయత్నం జరుగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి అనుమతులు పొందిన భూముల్లో అంత నాణ్యమైన ఇసుక ఉండదని, అందుకే వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలించి పట్టా భూముల్లో నిల్వ చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

- అనుమానాలు రేకెత్తిస్తున్న నిర్వాహకుల తీరు

పాములేరు వాగు పరివాహక ప్రాంతంలోని తమ భూముల్లో పేరుకుపోయిన ఇసుక మెట్లను తొలగించి వ్యవసాయానికి అనుకూలంగా మార్చాలని మండలంలోని రాజుపేట, కొబ్బరిపాడు, మంగలిగుట్ట గ్రామాలకు చెందిన కొందరు గిరిజన రైతులు గతంలో ఉన్నతాధికారులకు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో కొందరు రైతులకు ఇసుక తొలగింపునకు అనుమతులు లభించినట్లు సమాచారం.ఈ అనుమతులను ఆధారంగా చూపుతూ ప్రస్తుతం ముగ్గురు రైతుల భూముల్లో పనులు చేపట్టినప్పటికీ, నిబంధనల ప్రకారం నిర్ణయించిన లోతు వరకు మాత్రమే ఇసుక తొలగించాల్సి ఉండగా, 10 నుంచి 15 మీటర్ల లోతు వరకు భారీ యంత్రాలతో తవ్వకాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. అసలు ఆ ప్రాంతం పట్టా భూమి కాదని, వాగు పరివాహక ప్రాంతమేనని స్థానికులు చెబుతున్నారు. ఒకవేళ అవి నిజంగా పట్టా భూములే అయితే అంత లోతుగా గోతులు తవ్వితే ఆ భూములు భవిష్యత్తులో వ్యవసాయానికి ఎలా ఉపయోగపడతాయనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా రెవెన్యూ, మైనింగ్, ఇరిగేషన్ శాఖల అధికారులు సంయుక్తంగా పరిశీలించి వాస్తవ పరిస్థితిని ప్రజలకు వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై ములకలపల్లి తహశీల్దార్ స్వాతి బిందును ప్రజాజ్యోతి సంప్రదించగా, "మండలంలో రైతులు ఇసుక మెటలను తొలగింపునకు దరఖాస్తులు చేసుంటే, మైనింగ్, ఇరిగేషన్ శాఖలు మంజూరు చేస్తామని, ఎవరికి అనుమతులు మంజూరయ్యాయి అనేది తనకు తెలియదని, అక్రమ తవ్వకాలు, రవాణా జరిగకుండా పోలీసులు చూసుకుంటారని, పోలీసులు అక్రమ రవాణా అని గుర్తించి కేసు నమోదు చేస్తే, మండల మేజిస్ట్రేట్ హోదాలో చట్టప్రకారం జరిమానా విధించడం మాత్రమే తన పని చెప్పడం "హాస్యాస్పదంగా ఉంది.



# ముత్యాలమ్మ తల్లి ఉత్సవాలు ప్రారంభం





**చర్ల, జూలై 26(ప్రజా జ్యోతి):** చర్ల మండలంలోని లింగాపురంపాడు గ్రామంలో గ్రామదేవత శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ తల్లి వార్షిక ఉత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ సంబరాల్లో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల తొలి రోజున గ్రామ మహిళలు భారీ సంఖ్యలో మంచినీటి బిందెలతో ఆలయానికి చేరుకుని అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. అనంతరం ప్ర త్యేక పూజలు నిర్వహించి గ్రామ ప్రజ లు అమ్మవారిని దర్శించుకుని మొక్కు లు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగ ణం భక్తులతో కిక్కిరిసిపోయింది.ఉత్సవాల ఏర్పాట్లను గ్రామ పెద్దలు, యువకులు పర్యవేక్షిస్తుండగా చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజ లు, మొక్కుబడుల స్వీకరణ, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగనున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అల్లం దాసు, సాదం లోకనాథం, అడబాల సత్యనారాయణ, ముత్యాల రాణి, మేడిచర్ల సత్యనారాయణ, వేములపల్లి ప్రవీణ్, పున్నం వెంకటరమణ, పంజా రాజు, సాదం యుగంధర్ సాయి, కాకర్ల సత్యేంద్ర కుమార్, ముత్యాల చరణ్ తేజ, కాకర్ల సంతోష్ కుమార్, ముత్యాల సంపత్ కుమార్, కుక్కల చంటిబాబు, కర్ల లక్ష్మణరావు, పూజారి కృష్ణ పాల్గొన్నారు.

## విత్తన మేళాను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- వ్యవసాయ శాఖ అధికారి బాబురావు

**కొత్తగూడెం కలెక్టరేట్ ,జూలై 26,(ప్రజా జ్యోతి)** రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నాణ్యమైన విత్తనాలను అందుబాటులోకి తీసుకురావడం, పంటల దిగుబడిని పెంచడం లక్ష్యంగా "విత్తన మేళా–2026" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎల్–నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకుని, వ్యవసాయ శాఖ సూచించిన పంటలకే ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం గుర్తించిన విత్తన విక్రయ కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసి సాగు చేపట్టడం ద్వారా మెరుగైన దిగుబడులు సాధించవచ్చన్నారు, కొత్తగూడెం జిల్లాలో మండలాల వారీగా ఏర్పాటు చేసిన విత్తన విక్రయ కేంద్రాల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. విత్తనాల కొనుగోలు సమయంలో తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని, విత్తనాల ప్యాకెట్ పై బ్యాచ్ నంబర్, గడువు తేదీ, మొలక శాతం తదితర వివరాలను పరిశీలించాలని సూచించారు.రైతులు తమ ప్రాంతంలోని వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి స్థానిక పరిస్థితులకు అనువైన పంటలను ఎంపిక చేసుకోవాలని కోరారు. కంది, పెసర, మినుము, శనగ, జొన్న, సజ్జ, కొర్రలు తదితర పప్పుధాన్యాలు, చిరుధాన్యాల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు.నకిలీ విత్తనాల బారిన పడకుండా ప్రభుత్వం గుర్తింపు పొందిన లైసెన్స్ కలిగిన విక్రయ కేంద్రాల నుంచే విత్తనాలను కొనుగోలు చేయాలని, విత్తనాల కొనుగోలు అనంతరం బిల్లు భద్రపరచుకోవాలని సూచించారు. విత్తనాలకు సంబంధించి ఏవైనా సందేహాలు లేదా ఫిర్యాదులు ఉంటే వెంటనే సమీప వ్యవసాయ అధికారులను సంప్రదించాలని తెలిపారు.ప్రతి రైతు "విత్తన మేళా–2026"ను సద్వినియోగం చేసుకుని నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు సాధించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు ఆకాంక్షించారు.

## ముత్యాలంపాడులో భక్తిశ్రద్ధలతో ముత్యాలమ్మ బోనాలు





**ములకలపల్లి, జూలై 26 (ప్రజాజ్యోతి):** మండల పరిధిలోని ముత్యాలంపాడు గ్రామంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం ముత్యాలమ్మ తల్లి బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంప్రదాయబద్ధంగా బోనాలు సిద్ధం చేసిన మహిళలు వాటిని నెత్తిన పెట్టుకుని మేళతాళాల నడుమ నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా ముత్యాలమ్మ ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ పొడియం శ్రీను, మడకం నాగరాజు, మడకం రాముడు, పొడియం వెంకటేష్, చంటి, మడకం వెంకటేష్‌తో పాటు గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## ఆగస్టు 10 జైలు భరోను జయప్రదం చేయండి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అబ్దుల్ నబీ, మండల కన్వీనర్ ఎస్. సుగుణ పిలుపు



**ఆళ్లపల్లి,జులై. 26(ప్రజా జ్యోతి)** క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న నిర్వహించనున్న జైలు భరో కార్యక్రమాన్ని కార్మికులు, కర్షకులు, వ్యవసాయ కూలీలు పెద్దఎత్తున విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అబ్దుల్ నబీ, ఆళ్లపల్లి మండల కన్వీనర్ ఎస్. సుగుణ పిలుపునిచ్చారు.ఆదివారం మండలంలోని జిన్నెలగూడెం గ్రామంలో వై. కృష్ణకుమారి అధ్యక్షతన జరిగిన సీఐటీయూ మండల జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేసి, గతంలో అమల్లో ఉన్న 29 కార్మిక చట్టాలను యథావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే నూతన విత్తన చట్టం, విద్యుత్ చట్టం, వీబీజీ రామ్ జీ చట్టాలను కూడా ఉపసంహరించుకోవాలని కోరారు.రైతు వ్యతిరేక చట్టాలపై దేశవ్యాప్తంగా జరిగిన ఉద్యమాలకు కేంద్ర ప్రభుత్వం తలొగ్గి వాటిని రద్దు చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం కూడా పోరాటాలు కొనసాగుతాయని తెలిపారు. నాలుగు లేబర్ కోడ్ లు రద్దు చేసి,29 కార్మిక చట్టాలు పునరుద్ధరించే వరకు ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో చంద్రకళ, సునీత, లక్ష్మీకాంత, అనసూయ, తిరుపతమ్మ, పద్మ, రాంబాయి, బాలమ్మ, లీలావతి, అన్నపూర్ణ, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం ఘన విజయం

- రాష్ట్ర నాయకత్వానికి, పాల్గొన్న సభ్యులందరికీ బాణోతు లక్ష్మ కృతజ్ఞతలు



**టేకులపల్లి, జూలై 26,ప్రజాజ్యోతి:** హైదరాబాద్ నాంపల్లిలోని ప్రకాశం హాల్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర దివ్యాంగ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం ఘన విజయవంతమైందని తెలంగాణ రాష్ట్ర దివ్యాంగ ఉద్యోగుల సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి బాణోతు లక్ష్మ తెలిపారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి దివ్యాంగ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, సంఘ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమ్మేళనాన్ని విజయవంతం చేశారని ఆయన పేర్కొన్నారు. దివ్యాంగ ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం, సంక్షేమ చర్యల అమలుపై చర్చలు జరిగాయని తెలిపారు. సభకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర మంత్రి ఆట్లూరి లక్ష్మణ్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని హామీ ఇవ్వడం అభినందనీయమన్నారు.సమ్మేళనం విజయవంతానికి కృషి చేసిన రాష్ట్ర అధ్యక్షుడు షేక్ హబీబ్ మియా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య, ముత్తినేని వీరయ్య వర్మ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు మాలోత్ జగ్గుదాస్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా పాల్గొన్న సభ్యులందరికీ బాణోతు లక్ష్మ కృతజ్ఞతలు తెలిపారు. దివ్యాంగ ఉద్యోగుల హక్కుల సాధనకు ఐక్యంగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.

## సెక్యూరిటీ గార్డులకు రూ.19 వేల కనీస వేతనం అమలు చేయాలి

- బకాయిలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలి
- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాటల సోమన్న



**బూర్గంపహాడ్, జూలై26 (ప్రజా జ్యోతి):** తెలంగాణలోని వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులకు నెలకు రూ.19 వేల కనీస వేతనం తక్షణమే అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ మార్కెట్ కమిటీల సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాటల సోమన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం బూర్గంపహాడ్ వ్యవసాయ మార్కెట్ యార్డులో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల సాంబయ్య అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా యాటల సోమన్న మాట్లాడుతూ రాష్ట్రంలోని 192 వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో సుమారు 1,200 మంది సెక్యూరిటీ గార్డులు మూడు దశాబ్దాలుగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ వారికి న్యాయమైన హక్కులు ఇప్పటికీ అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వ జీవోలు, కనీస వేతనాల ఉత్తర్వుల మేరకు రూ.19 వేల కనీస వేతనం అమలు చేయడంతో పాటు బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని కోరారు. పదవీ విరమణ చేసిన సెక్యూరిటీ గార్డులకు ప్రకటించిన రూ.5 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను కూడా తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఆంధ్రప్రదేశ్‌లో అమలులో ఉన్న సంక్షేమ పథకాల తరహాలో మరణ సహాయం, ప్రమాద మరణ పరిహారం, సహజ మరణ సహాయం, వైద్య సహాయం వంటి ప్రయోజనాలను తెలంగాణ వ్యవసాయ మార్కెట్ కమిటీల సెక్యూరిటీ గార్డులకు కూడా వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ప్రభుత్వం వెంటనే సానుకూల నిర్ణయం తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా సెక్యూరిటీ గార్డులను సమీకరించి ఉద్యమ కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో యూనియన్ ఉపాధ్యక్షుడు సదానందం, నాయకులు జి. వెంకటనారాయణ, సారిక రాము, ఎండీ మస్తాన్, వై. రామాంజనేయులు, ఎస్. రమేష్, పి. వెంకటేష్, మహేందర్ రెడ్డి, శోభారాణి, దుర్గా, మహమూద్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్

**కొత్తగూడెం కలెక్టరేట్ ,జులై 26,(ప్రజా జ్యోతి )** నేడు సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు.ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కావున సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లా ప్రజల సౌకర్యార్థం సబ్ కలెక్టర్ భద్రాచలం కార్యాలయంలో, ఆర్డీవో కార్యాలయం కొత్తగూడెంలో ప్రజావాణి నిర్వహించబడుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## పినపాకలో డ్రగ్ డిటెక్షన్ టెస్టులు

- యువతను మత్తు పదార్థాలకు దూరం చేయడమే లక్ష్యం




**పినపాక,జూలై 26(ప్రజాజ్యోతి ):** పినపాక మండలంలో అనుమానితులకు యూరిన్ శాంపిల్స్ ద్వారా డ్రగ్ డిటెక్షన్ పరీక్షలు నిర్వహించినట్లు ఈ బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు తెలియజేశారు. ఆదివారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి పర్యవేక్షణలో ఈ పరీక్షలు నిర్వహించగా అందరికీ నెగటివ్ వచ్చినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసైన వారిని గుర్తించి డీ–అడిక్షన్ సెంటర్లకు పంపించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. ఇటువంటి తనిఖీలు ప్రతిరోజు కొనసాగుతాయని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా పునీతులు జాకీము-అన్నమ్మల మహోత్సవం

- వృద్ధ దంపతులకు సత్కారాలు.. విద్యార్థులకు ఉచిత నోట్ పుస్తకాల పంపిణీ



**ఆళ్లపల్లి, జూలై 26(ప్రజా జ్యోతి )** ఆళ్ళపల్లి లోని ఆర్‌సీఎం చర్చిలో పునీతులు జాకీము–అన్నమ్మల పవిత్ర మహోత్సవ వేడుకలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించినట్లు ఫాదర్ జేసు ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా జిన్నెల గూడెం, మర్కోడు, ముత్తాపురం, ఆళ్ళపల్లి.గ్రామ క్రైస్తవ విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.ఫాదర్ జేసు ప్రసాద్ ఆధ్వర్యంలో దివ్యబలిపూజ నిర్వహించి, ఆయా గ్రామాల వృద్ధ దంపతులను ఘనంగా సన్మానించి వారి ఆశీర్వాదాలు పొందారు. కుటుంబంలో పెద్దలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఆదర్శవంతమైన కుటుంబ జీవనానికి సువార్త బోధనలు మార్గదర్శకమని ఆయన సందేశమిచ్చారు.అనంతరం విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు పంపిణీ చేసి, కేక్ కట్ చేసి భక్తులకు అందజేశారు. సిస్టర్స్, సంఘస్థుల ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం, తేనీటి విందు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డీఎస్ఎస్ సిస్టర్స్ ప్రశాంత, జయానంద, థామరిస్, యానిమేటర్ పరమ ప్రభాకర్, ఉపదేశులు కిరణ్, నాగేశ్వరరావు, ఆంథోని, రాములు, సంఘ పెద్దలు నాగేశ్వరరావు, రాంబాబు, రామ్మూర్తి, మరియా దళ సభ్యులు, యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# వర్షాలు లేక రైతులలో నెలకొన్న ఆందోళన

- చింతలచెరువు నీటిని విడుదల చేసిన కొత్వాల
- ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు
- నీటిని వృధా కాని వ్వొద్దు
- కొత్వాల శ్రీనివాస రావు





**పాల్వంచ, జూలై 26, ప్రజాజ్యోతి:** వర్షాలు కురవాలని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, అమ్మవార్లకు బోనాల సమర్పించిన పాల్వంచ ప్రజలు. రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం కారణంగా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక పోవడంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, అందుబాటులో ఉన్న నీటిని అత్యంత పొదుపుగా వినియోగించాలని రైతులకు పాల్వంచ సొసైటీ అధ్యక్షులు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు సూచించారు.ఆదివారం పాత పాల్వంచలోని చింతలచెరువు ఆయకట్టు రైతులకు సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని చెరువులోని నీటిని కొత్వాల శ్రీనివాసరావు విడుదల చేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో రైతులు నీటిని వృథా చేయకుండా ప్రతి చుక్కను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.రాష్ట్రంలో తగినంత వర్షపాతం లేక వ్యవసాయం తీవ్రంగా ప్రభావితమవుతోందని, ముఖ్యంగా వరి సాగు చేసే రైతు లు పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాల ని సూచించారు. నీటి లభ్యతను బట్టి పంటల ఎంపిక చేసుకోవడం వల్ల న ష్టాలను కొంతవరకు తగ్గించుకోవచ్చని తెలిపారు.ఇదే సందర్భంగా మంచి వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ పాత పాల్వంచలోని బొడ్రాయి, ముత్యాలమ్మ తల్లి, మైసమ్మ తల్లి దేవాలయాల్లో రైతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్లకు బోనాలు సమర్పించి, సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో పాత పాల్వంచ 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలా దేవి, రైతులు కొత్వాల సత్యనారాయణ, ముత్యాల రమణమూర్తి, కొండం వెంకన్న, వనమా చిన్నబాబు, యాటా వీరయ్య, బొడ్డు రాములు, నరసింహారావు, గురుమూర్తి, యాటా బాలాజీ, వజ్జల రాము, బూసి శ్రీను, ధర్మరాజుల రమేష్, యాటా నాని, బొందిల బాలాజీ, సయ్యద్ కరీం, నీరుడు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఎస్ఐఆర్‌లో ఓటు నమోదు చేసుకోవాలి

- రానా ప్రతాప్ రాథోడ్



**ఆళ్ళపల్లి,జులై26(ప్రజా జ్యోతి )** ఆళ్లపల్లి మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వాసం శ్రీకాంత్ ఆధ్వర్యంలో (ఎస్ఐఆర్ ) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ఇన్‌చార్జ్ రానా ప్రతాప్ రాథోడ్, జిల్లా నాయకుడు గాదే కేశవరెడ్డి, మాజీ ఎంపీపీ పడిగ సమ్మయ్య, మండల సీనియర్ నాయకుడు ఎండీ అతహర్,ఆళ్ళపల్లి సర్పంచ్ వాసం సుష్మిత, రామానుజగూడెం సర్పంచ్ మోకాళ్ల చంద్రశేఖర్, పానుగంటి మంగ పద్మ, సంపత్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రానా ప్రతాప్ రాథోడ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎస్ఐఆర్ ద్వారా తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని, ఓటు హక్కు అత్యంత విలువైన ప్రజాస్వామ్య హక్కు అని తెలిపారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి కాలనీల్లో పర్యటించి ఓటర్లకు అవగాహన కల్పించారు.

## కంటైనర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- ఐదుగురు ప్రయాణికులకు గాయాలు..కేసు నమోదు



**దమ్మపేట,జూలై.26(ప్రజాజ్యోతి ):** దమ్మపేట మండల పరిధిలోని ముష్టిబండ వద్ద అప్పారావుపేట స్టేజి సమీపంలో శనివారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సత్తుపల్లి డిపోకు చెందిన టియస్ 04యుసి 0068 నెంబర్ గల ఆర్టీసీ బస్సు అశ్వరావుపేట నుంచి సత్తుపల్లి వైపు వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న కంటైనర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న ఐదుగురు ప్రయాణికులు గాయపడ్డారు.ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు స్పందించి క్షతగాత్రులను అశ్వరావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఘటనపై బస్సు డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దమ్మపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలపై విచారణ కొనసాగుతోంది.

## సీతారామ ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలపై ఎమ్మెల్యే జారేకు వినతి

- నిర్వాసితులకు న్యాయం చేస్తానని ఎమ్మెల్యే హామీ
- జూలై 30న జిల్లా అధికారులతో ప్రత్యేక సమావేశం



**దమ్మపేట,జూలై.26(ప్రజాజ్యోతి ) :** సీతారామ ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి చర్యలు వేగవంతం చేయాలని కోరుతూ ఆదివాసీ నాయకులు, ఆరు గ్రామ పంచాయతీల సర్పంచులు, ప్రజాప్రతినిధులు ఆదివారం అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ నాయకుడు కారం శ్రీరాములు మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్వాసితులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు, పంట కాలువల నిర్మాణంలో ఉన్న ఇబ్బందులు, భూ పరిహారం, సాగునీటి సౌకర్యాల అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. నిర్వాసిత కుటుంబాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించాలని కోరినట్లు చెప్పారు.వినతిని స్వీకరించిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ స్పందిస్తూ నిర్వాసితులకు న్యాయం జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కారం శ్రీరాములు తెలిపారు. ఈ నెల 30వ తేదీన జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి (పీవో), సీతారామ ఇరిగేషన్ శాఖ అధికారులు, సంబంధిత మండల అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి నిర్వాసితుల సమస్యలపై సమగ్రంగా చర్చించి పరిష్కార మార్గాలను ఖరారు చేస్తామని ఎమ్మెల్యే తెలిపినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు కూరం అర్జునరావు, మొకళ్ల గురుమూర్తి, వంక జానకిరాముడు, కొమరం సుశీల, మాజీ సర్పంచ్ కోరస సాగర్, చెలికాని సూరిబాబు, తాటి రాములు, కొండ్రు ప్రసాద్‌తో పాటు ఆరు గ్రామ పంచాయతీల ప్రజాప్రతినిధులు, నిర్వాసితులు, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.